క్లుప్తంగా

షాట్‌పుట్‌లో దీక్షిత ప్రతిభ



విద్యార్థిని వడ్డి దీక్షిత మైటీని అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

తగరపువలస: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం – విజయవాడ అంతర కళాశాలల అథ్లెటిక్ పోటీల్లో షాట్‌పుట్ విభాగంలో సంగివలస అనిల్ నీరుకొండ దంతవైద్య కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థిని వడ్డి దీక్షిత మైటీ రన్నర్‌గా నిలిచింది. ఇటీవల ఆంధ్రా మెడికల్ కళాశాల వేదికగా ఈ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో డైరెక్టర్ ఎస్.ఆర్.కె.రెడ్డి, సీఈవో నిరంజన్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ వంశీకృష్ణారెడ్డి, ఏవో జేవీడీ నాయుడు, ఫిజికల్ డైరెక్టర్ గున్నాజీ తదితరులు దీక్షితను అభినందించారు.

నేలకొరిగిన మొక్కజొన్న



విలాస్కాన్‌పాలెంలో నేలకొరిగిన మొక్కజొన్న

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మొక్కజొన్న పంట నేల కొరిగింది. కృష్ణాపురం, విలాస్కాన్‌పాలెం, గంధవరం గ్రామాల్లో పంట నేలకొరిగింది. వెన్ను పాలుపోసుకునే దశలో వర్షానికి నెలకొరగడంతో, వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి ఆరుగాలం కష్టపడిన రైతన్నలు ఆవేదన చెందుతున్నారు.

420 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శోభారాణి

తగరపువలస: భీమిలి మండలం దివీస్ లేబరేటరీ ఆధ్వర్యంలో చిప్పాడ పంచాయతీలో బుధవారం ఉచిత వైద్యశిబిరం ద్వారా వివిధ పాఠశాలలకు చెందిన 420 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. తాళ్లవలస పీహెచ్‌సీ వైద్యురాలు బి.శోభారాణి బృందం విద్యార్థులను పరీక్షించి, మందులు పంపిణీ చేసింది. అంటువ్యాధుల గురించి వివరించి, తీసుకోవలసిన జాగ్రత్తలను వైద్యులు వివరించారు. ముందుగా శిబిరాన్ని సర్పంచ్ వెంపాడ రమావతి ప్రారంభించారు. దివీస్ ప్రతినిధులు ఇ.ఎస్.నాగరాజు, నరసింహారావు, ఎంపీటీసీ సభ్యురాలు చుక్క ఈశ్వరమ్మ, వెంపాడ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గీతంలో ఘనంగా 'ఎచీవర్స్ డే'



విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న చక్రవర్తి

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నుంచి ఈ ఏడాది రికార్డు స్థాయిలో 3,200 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం తెలిపారు. ఎచీవర్స్ డే విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక సంఖ్యలో విద్యార్థులను ఉద్యోగస్తులుగా ఏటా అందిస్తున్న ఘనత గీతందే అని పేర్కొన్నారు. టాటా కన్సల్టెన్సీ ఉపాధ్యక్షుడు, రిసోర్సు మేనేజ్‌మెంట్ గ్రూప్ గ్లోబల్ హెడ్ ఇ.ఎస్. చక్రవర్తి ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రొఫెసర్లు గురుమూర్తి గంగాధరన్, గౌతమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీసీతారాముల కల్యాణం చూతము రారండి



రామాలయం వద్ద పెళ్లి రాట వేస్తున్న భక్తులు



సీతారాముల కల్యాణానికి సిద్ధమైన జ్యూట్‌మిల్లు రామాలయం



మధురవాడ కోదండ రాముడి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో సీతారాములు



విద్యుద్దీపాల వెలుగులో దుర్గాలమ్మ ఆలయం

తగరపువలస: శ్రీరామనవమి వేడుకల సందర్భంగా గురువారం భీమిలి అర్బన్, రూరల్ పరిధిలోని పలు రామాలయాల్లో సీతారాములకు కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 9వ రోజు నవమినాడు ప్రతీ రామాలయంలో కల్యాణం జరపడం ఆనవాయితీ. ఆయా ఆలయ కమిటీల సభ్యులు కల్యాణంతోపాటు శోభాయాత్ర, అన్నదానాలు నిర్వహించనున్నారు. ఆలయాల వద్ద కొబ్బరి ఆకుల పందిళ్లు, ఉత్సవరాట వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డులోని చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయం, రెండో వార్డు జీరుపేట, భీమిలి మండలంలోని పాత మూలకుద్దు, తాళ్లవలస, తాటితూరు గ్రామాల్లో కల్యాణంతోపాటు అన్నదానాలు చేయనున్నట్టు ఆయా ఆలయ కమిటీల ప్రతినిధులు ఇప్పటికే ప్రచారం చేశారు. ఇవేకాకుండా వలందపేట, తగరపువలస మెయిన్ రోడ్డులోని రామాలయాల్లో నవమి వేడుకలు నిర్వహించనున్నారు.

విజ్ఞాన్ విహార్ ఆవరణలో ఏర్పాట్లు

ఆనందపురం : మండలంలోని గుడిలోవలో ఉన్న విజ్ఞాన్ విహార్ ఆవరణలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో గురువారం శ్రీరామ నవమి ఉత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం భక్తులచే సామూహిక సీతారాముల కల్యాణోత్సవం, ఆంధ్ర విశ్వకళాపరిషత్ విశ్రాంత ఆచార్యులు వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రిచే ప్రవచనం, సాయంత్రం సీతారామ కల్యాణమూర్తుల ఊరేగింపు, రాత్రికి సంకీర్తన ఉంటుందని వివరించారు. కల్యాణంలో పాల్గొనదలచిన దంపతులు సంప్రదాయ దుస్తులు ధరించి పూజా సామగ్రిని వెంట తెచ్చుకోవాలని సూచించారు.

ఘనంగా పెళ్లిరాట ఉత్సవం

పద్మనాభం: శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా మండలంలోని కృష్ణాపురం రెల్లికాలనీలోని రామాలయం వద్ద బుధవారం పెళ్లిరాట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా విశ్వక్షేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం పెళ్లిరాట వేశారు. కార్యక్రమంలో పీటీఏ చైర్మన్ పల్లా రమణ, బంగారి వెంకట రమణ, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మధురవాడ: సీతారాముల కల్యాణ మహోత్సవానికి మధురవాడ పరిసర ప్రాంతాల్లోని ఆలయాలు ముస్తాబయ్యాయి. బక్కన్నపాలెం రోడ్డులోని కోదండ రామాలయం, గణేష్‌నగర్‌లోని శ్రీ విజయ గణపతి పంచాయతన దేవాలయం, జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయం, మానం ఆంజనేయులు నగర్‌లోని శ్రీ లలితా త్రిపుర సుందర సమేత మహా కామేశ్వర స్వామి ఆలయాల్లో శ్రీ రామ నవమి వేడుకల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. కల్యాణోత్సవం అనంతరం నారాయణ సేవ, తిరువీధి ఉత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు చెప్పారు.

నేడు శిల్పారామంలో నృత్య ప్రదర్శనలు

పీఎం పాలెం: శిల్పారామం జాతరలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని స్థానిక పరిపాలన అధికారి టి.విశ్వనాథ రెడ్డి తెలిపారు. విజయనగరానికి చెందిన శ్రీ విజయ నృత్య కళానికేతన్ ఆధ్వర్యంలో కూచిపూడి, జానపద నృత్యాల ప్రదర్శన ఉంటుందని తెలియజేశారు.

యువతి అదృశ్యం

పీఎం పాలెం: ఓ యువతి అదృశ్యంపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ వై .రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మధురవాడ భగవాన్ దాస్ కాలనీకి చెందిన ఎం. స్రవంతి(22) ప్రైవేటు కంపెనీలో టైలరింగ్ చేస్తుంటుంది. ఈ నెల 24వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు ఇంటినుంచి వెళ్లిన ఆమె, మళ్లీ ఇల్లు చేరలేదు. చుట్టు పట్ల వెదికించినా ఫలితం లేకపోవడంతో ఆమె తండ్రి త్రినాథ్ పీఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఉత్తమ ఫలితాలతోనే ఉపాధ్యాయులకు గుర్తింపు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు వెంకటరావు

ఆనందపురం : పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధిస్తేనే ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు అన్నారు. మండలంలోని గొట్టిపల్లి పంచాయతీ, వెంకటాపురం ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అందించి మంచి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ఎంఈవో బాలామణి మాట్లాడుతూ నాడు – నేడు కార్యక్రమం కింద పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందని చెప్పారు. విద్యార్థులతో ఉపాధ్యాయులు మమేకమై బోధన సాగించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం విశ్రాంత బ్యాంక్ మేనేజర్ చంద్రమౌళి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గంటా జగదీశ్వరరావు, హెచ్ఎం వర్మ, ఇల్లాపు వెంకటరావు, ఉపాధ్యాయులు జయభారతి, నిర్మల అపరంజి, జ్యోతిర్మయి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ' విజయవంతానికి పిలుపు

ఆనందపురం : కార్మిక, కర్షకుల సమస్యల పరిష్కారానికై ఏప్రిల్ 5న నిర్వహించతలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ భీమిలి డివిజన్ కార్యదర్శి రవ్వ నరిసింగరావు కోరారు. మండలంలోని వేములవలస, ఆనందపురం, బంటుబిల్లి వారి కళ్లాలులో సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నరిసింగరావు మాట్లాడుతూ స్టీలుప్లాంట్ ప్రైవేటీకరణ, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, అసంఘటిత, సంఘటిత రంగ కార్మికుల కనీస వేతనాల పెంపు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సేవల క్రమబద్ధీకరణ వంటి సమస్యల పరిష్కారాలకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, వివిధ వర్గాల వారు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ముఠా వర్కర్స్ యూనియన్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

మహిళలను లక్షాధికారులను చేయడమే సీఎం లక్ష్యం



మెగా చెక్‌ను మహిళలకు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

కొమ్మాది: మహిళలను లక్షాధికారులను చేయడమే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా మూడో విడతగా విడుదలైన మెగా చెక్‌ను 4వ వార్డు కె.నగరపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మహిళలకు అందజేశారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి మాట్లాడుతూ మహిళా సాధికారత సహా వారి అభ్యున్నతి కోసం అనేక పథకాలు అమలు చేస్తున్న సీఎం జగన్‌ను అక్క చెల్లెళ్లు నిండు మనసుతో ఆశీర్వదించాలని ఆయన కోరారు. 1,2,3,4 వార్డుల్లో ఉన్న స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ. 9కోట్ల 70 లక్షల 55 వేల 530 రూపాయల చెక్కును ఆయన అందజేశారు. 12,857 మంది సభ్యులు లబ్ధిదారులని ఆయన తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి ఆసరా లబ్ధిదారులతో కలసి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు, జేఏస్సీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ హర్షరెడ్డి, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డి, జెడ్పీ బొడ్డేపల్లి రాము, స్థానిక నాయకులు ఎరుసు అప్పలకొండ రెడ్డి, నాగోతి సింగన్న, తొత్తడి అప్పన్న, బోర రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ మార్కెట్ వేలం ఖరారు



వేలంపాట నిర్వహిస్తున్న సూపరింటెండెంట్ అప్పలరాజు

మధురవాడ: జీవీఎంసీ జోన్–2లోని మధురవాడ డైలీ మార్కెట్, వారపు సంత, రోడ్డు మార్జిన్ వేలం పాట ఖరారైంది. బుధవారం సాయంత్రం జోనల్ కార్యాలయంలో జెడ్సీ కనక మహాలక్ష్మి పర్యవేక్షణలో సూపరింటెండెంట్ అప్పలరాజు పాట నిర్వహించారు. ఇక్కడ ముడసర్లోవ పార్కు ప్రవేశ రుసుము, పార్కింగ్, క్యాంటీన్, ఐస్‌క్రీం బండ్ల నిర్వహణ వంటివాటికి ఒక్కరే రావడంతో మళ్లీ వాయిదా పడ్డాయి. మార్కెట్ పాట మాత్రం విజయనగరానికి చెందిన పి. నారాయణరావు 21లక్ష 8వేల రూపాయలకు కైవసం చేసుకున్నారు. దీనికి జీఎస్టీ, స్వచ్ఛభారత్ సెస్ కలిపి మొత్తంగా 25లక్షలు చెల్లించాల్సి ఉంటుందని అప్పలరాజు చెప్పారు.

కృష్ణవేణికి ఘన నివాళి



కృష్ణవేణి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు

మధురవాడ: బక్కన్నపాలెం మాజీ సర్పంచ్ దివంగత వైఎస్సార్‌సీపీ నేత పోతిన వెంకటరమణబాబు భార్య దివంగత పోతిన కృష్ణవేణి (రమణమ్మ) చిత్రపటానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వారి కుటుంబ సభ్యులు, వివిధ పార్టీల నేతలు ఘనంగా నివాళులర్పించారు. బక్కన్నపాలెం సాయిప్రియ గార్డెన్ రోడ్డులో బుధవారం ఏర్పాటు చేసిన భారీ సంతాప సభలో ఆమె, రమణబాబు చిత్రపటాలకు పూలమాలలు వేసి వారి సేవలు కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రమణ బాబు అడుగుజాడల్లో కృష్ణవేణి నడిచి ఈ ప్రాంత అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, నగరాలు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిళ్లా సుజాత, పోతిన మూర్తిబాబు, పోతిన విజయ వినాయక్, సూర్యారావు, కార్పొరేటర్ కంపా హనూక్, మాజీ కార్పొరేటర్లు పోతిన హనుమంతురావు, జగ్గుపిల్లి అప్పలరాజు, నాయకులు పోతిన శ్రీనివాసరావు, బొట్ట అప్పలరాజు, క్రిడాయ్ రాష్ట్ర కార్యదర్శి బాయిన శ్రీనివాస్ తదితరులు నివాళులర్పించారు.

విద్యార్థులు నవకల్పనలపై దృష్టి సారించాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న జేఎన్‌టీయూవీ వీసీ వెంకట సుబ్బయ్య

తగరపువలస: విద్యార్థులు నిరంతరం నవకల్పనలపై దృష్టి సారించి, దేశాభివృద్ధికి తోడ్పడాలని ఐఐటీ భువనేశ్వర్ విశ్రాంత డైరెక్టర్ రత్నం వారాడ రాజ్‌కుమార్ అన్నారు. చెరకుపల్లి అవంతి విద్యాసంస్థల వార్షిక వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దీర్ఘకాలంలో ఇంజినీరింగ్ కోర్ బ్రాంచ్‌లలో ముఖ్యంగా ఐటీ విభాగంపై దృష్టి సారించాలన్నారు. నైపుణ్యంతో సమస్యల పరిష్కారం, రీసెర్చ్‌లలో నూతన పోకడలు అవసరమన్నారు. జేఎన్‌టీయూ విజయనగరం ఉపకులపతి కె.వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ విద్యార్థులకు తమ నాలుగు విద్యా సంవత్సరాలలో 160 సాంకేతిక సదస్సులు పూర్తి చేయగలగాలన్నారు. తమ భవిష్యత్తుకు వారే పునాదులు వేసుకోవాలన్నారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖలో ఐటీ పరిశ్రమను అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోని విద్యాసంస్థలలో వసతుల కల్పనకు రూ.54వేల కోట్లకు పైగా ఖర్చు చేశారన్నారు. నిమయ్ సాఫ్ట్ సిస్టమ్స్ వ్యవస్థాపకుడు కొసరాజు శ్రీధర్ మాట్లాడుతూ విశాఖ ఐటీ విభాగంలో అందుబాటులో ఉన్న కొలువులు, అవకాశాల గురించి వివరించారు. అవంతి విద్యాసంస్థల డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, అడ్మిరల్ శ్రీనివాస రత్నం మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందించారు. ప్లేబ్యాక్ సింగర్లు ఎం.హనుమాన్, వి.అఖిల తమ పాటలతో విద్యార్థులకు ఆకట్టుకున్నారు.

జగనన్న కాలనీ బైపాస్ రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: మండలంలోని బాందేవుపురం పంచాయతీ విజయరాంపురం జగనన్న కాలనీకి నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ కంటుబోతు రాంబాబు బుధవారం పరిశీలించారు. విజయరాంపురంలో జగనన్న రూరల్ కాలనీ కింద విలాస్కాన్‌పాలెం, తిమ్మాపురం, బాందేవుపురం గ్రామాలకు చెందిన 134 మందికి, జగనన్న పట్టణ గృహ అభివృద్ధి పథకం కింద 1684 మందికి, మద్దిలో జగనన్న పట్టణ గృహ అభివృద్ధి పథకం కింద ఆరు వందల మందికి, రూరల్ కాలనీ కింద 95 మందికి ఇళ్లు మంజూరు చేశారు. ఇప్పటికే కొన్ని ఇళ్లు పూర్తయ్యాయి. మరి కొన్ని ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. ఈ కాలనీ ఇళ్లకు ఉపయోగపడే విధంగా మద్ది–అలమండ రోడ్డుకు అనుసంధానంగా విజయరాంపురం లేఅవుట్ వరకు బైపాస్ రోడ్డు నిర్మిస్తున్నారు. భీమునిపట్నం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఎంపీపీ కంటుబోతు రాంబాబు చొరవతో మండల పరిషత్ నిధులు రూ.4లక్షలతో బాందేవుపురం రెల్లి కాలనీ పై నుంచి కొండను తొలిచి ఈ రోడ్డు వేస్తున్నారు. ఆ పనులను ఎంపీపీ రాంబాబు పరిశీలించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు బోని సన్యాసినాయుడు, సుంకర పైడినాయుడు ఉన్నారు.

జగనన్నతోనే అన్ని వర్గాల సంక్షేమం



అవ్వతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా 4వ వార్డు చుక్కవానిపాలెం, పాతూరు, పుక్కళ్ళపాలెం ప్రాంతాల్లో ఆయన బుధవారం పర్యటించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అందరినీ ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధిని, సంక్షేమాన్ని రెండుకళ్లుగా భావించి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నారన్నారు. కుట్రలకు, మోసాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే చంద్రబాబును ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జనం జగనన్నకే జేజేలు పలకడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు, వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డి, బోర రామకృష్ణ, మేరుగు చిన్నారావు, విష్ణు, నాగోతి సింగన్న, ఎరుసు అప్పలకొండరెడ్డి, వాండ్రాసి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం కోసం 'సపోషణ పూజ'



సపోషణ పూజా కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రైతులు

తగరపువలస: విచ్చలవిడిగా రసాయన ఎరువులు, పురుగుల మందులు వినియోగించడం వల్ల భూసారం తగ్గిన భూముల్లో జీవం పెంచడానికి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం గ్రామ వికాస సమితి ఆధ్వర్యంలో బుధవారం భీమిలి మండలం శింగనబందలో సపోషణ పూజ జరిపారు. డీఎల్‌డీఎ చైర్మన్ గాడు వెంకటప్పడు ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య సర్పంచ్ గాడు వెంకటనారాయణ భూమిపూజ చేసి, రైతులకు మట్టిని అందించారు. ఈ మట్టిని వారి భూములలో చల్లుకోవాలని సూచించారు. దేశవ్యాప్తంగా జరుపుతున్న సపోషణ కార్యక్రమాల ద్వారా మళ్లీ వ్యవసాయభూములు పునరుత్తేజం కానున్నాయని పండితులు తెలిపారు. కార్యక్రమంలో సంఘ పరివార్ తరపున తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన

తగరపువలస: పోషణ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు సంతపేట అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార పక్షోత్సవాలను గురువారం నిర్వహించారు. ఐసీడీఎస్ భీమిలీ పీవో శ్రీదేవి, సూపర్‌వైజర్ కె.ప్రమీల మాట్లాడుతూ వెయ్యి రోజుల కేర్ అనగా మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి డెలివరీ అయి బిడ్డకు రెండేళ్లు పూర్తయ్యేవరకు తీసుకోవలసిన పోషకాహారం గురించి కార్యకర్తలకు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే వైఎస్సార్ సంపూర్ణ పోషకపదార్థాల గురించి తెలియజేశారు. ఇవి దుర్వినియోగం కాకుండా నేరుగా లబ్ధిదారులకు చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఎంఎస్‌కెలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు 'అనిల్ నీరుకొండ' లో వైద్య సేవలకు వినతి



సీఈవో నిరంజన్ కుమార్‌తో మాట్లాడుతున్న మాజీ సైనికుల ప్రతినిధులు

తగరపువలస: మాజీ సైనికులకు సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రిలో ఎక్స్ సర్వీస్‌మెన్ కంట్రిబ్యూటరీ హెల్త్ స్కీం(ఈసీహెచ్ఎస్) ద్వారా వైద్యసేవలు అందించాలని జిల్లా సైనిక సంక్షేమ అధికారి సత్యానంద్ కోరారు. ఆస్పత్రి సీఈవో కె.నిరంజన్‌కుమార్, జనరల్ మేనేజర్ గణేష్, డైరెక్టర్ ఎస్.ఆర్.కె.రెడ్డి లతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. ఆరుమాసాల క్రితం ఢిల్లీకి చెందిన సైనిక సంక్షేమ అధికారులు ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాల సైనిక సంక్షేమ అధికారులతో సమావేశమయ్యారు. అప్పట్లో మాజీ సైనికులు మాట్లాడుతూ ఈసీహెచ్ఎస్ ద్వారా విశాఖలో వైద్యసేవలు పొందడానికి కష్టంగా ఉందని, అందుబాటులో ఉన్న సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రిలో ఈ సేవలు అందించాలని కోరారు. ఆ విషయాన్ని ఆసుపత్రి యాజమాన్యం దృష్టికి తీసుకురాగా, సానుకూలంగా స్పందించింది. సమావేశంలో శ్రీచైతన్య మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కేజీ రెడ్డి, కార్యదర్శి సీటీ రెడ్డి, కె.రాజన్నరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా యువత



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ జె.మాధవి

ఏయూ క్యాంపస్: యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని డిప్యూటీ కలెక్టర్ జె.మాధవి అన్నారు. బుధవారం ఏయూ ఫార్మసీ కళాశాల సమావేశ మందిరంలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యువతరం ఆరోగ్య జీవనం అలవరచుకోవాలని సూచించారు.

ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ మాట్లాడుతూ 'సే నో టు డ్రగ్స్'అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. యువత పెడతోవ పట్టకుండా వారిలో మంచి ఆలోచనలు పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ 14500 ఏర్పాటు చేసి యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచే ప్రయత్నం చేస్తోందన్నారు. ఏయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ చైర్మన్ ఉమారాజ్, ప్రభుత్వ మానసిక వైద్యశాల వైద్యులు డాక్టర్ కె.ప్రభాత్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ ఎల్.మాధవి, ఎక్సైజ్ విభాగం ఎస్ఐ జి.రాజేశ్వరి, ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి.శైలజ పాల్గొన్నారు.

అధికారుల తీరుతో పనులు అసంపూర్ణం



మంగమారిపేట రోడ్డు పక్కన పడి ఉన్న విద్యుత్ స్తంభాలు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డులో తొట్లకొండ నుంచి భీమిలి వరకు సెంట్రల్ లైట్ల ఏర్పాట్లకు జీవీఎంసీ సుమారు రూ. 5 కోట్లు నిధులు మంజూరు చేసింది. జి–20 సన్నాహక సదస్సు నేపథ్యంలో బీచ్ రోడ్డు వెంబడి విద్యుత్ కాంతులు ఉండాలని సదస్సు ప్రారంభం అయ్యేప్పటికి పనులు ప్రారంభం కావాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. కానీ పలువురు అధికారుల నిర్లక్ష్యం కారణంగా సెంట్రల్ లైటింగ్ పనులు అసంపూర్ణంగా నిలిచిపోయాయి. భీమిలి నుంచి ఉప్పాడ వరకు విద్యుత్ స్తంభాలు వేశారు కానీ లైట్లను ఏర్పాటు చేయలేదు. ఉప్పాడ నుంచి మంగమారిపేట తొట్లకొండ వరకు విద్యుత్ స్తంభాలు రోడ్డు మీద మూలకు చేరాయి. దీనిపై ఏఈ సుమన్‌ను వివరణ కోరగా జి–20 సదస్సు నగరంలో జరుగుతుంది కనుక, ఇక్కడ అంత ఆసక్తి కనపరచలేదని చెప్పడం గమనార్హం.

రాయపాలెం మలుపు వద్ద జీబ్రా లైన్లు

తగరపువలస: భీమిలి రోడ్డులో రాయపాలెం మలుపు వద్ద ఇటీవల బీటీ రోడ్డుకు మరమ్మతులు నిర్వహించి వేసిన స్పీడ్‌బ్రేకర్లకు బుధవారం జీబ్రాలైన్లు వేశారు. భీమిలి మండలం రేఖవానిపాలెం సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రమాదాల నివారణకు ఈ జీబ్రాలైన్లు వేశారు. గతంలో ఇదే మలుపు వద్ద ప్రమాదాలు జరుగకుండా సర్పంచ్ స్టాపర్లు ఏర్పాటు చేశారు.